సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 21 । జూన్ । 2023



మంత్రపురిలో భారతీ స్వామి

మంథని:మంత్రపురిలోని ఆలయాలను శృంగేరి శివగంగా శారద పీఠాధిపతి పురుషోత్తమ భారతీస్వామి మంగళవారం సందర్శించారు. గోదావరిలో స్నానమాచరించి గౌతమేశ్వరస్వామికి అభిషేకం చేశారు.



పత్తి క్వింటాల్‌కు రూ.6,751

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు మంగళవారం రూ.6,751 పలికింది. కనిష్టంగా రూ.6,022, సరాసరి రూ.6,631గా నమోదైనట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

ట్రినిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన



ఎంపికైన అభ్యర్థులతో సిబ్బంది

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో టాస్క్ సహకారంతో ఆన్‌స్కూల్ (ఎడు టెక్) మల్టీనేషనల్ కంపెనీ మంగళవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు అనూహ్య స్పందన లభించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని దాదాపు 300 మంది హాజరయ్యారు. వారిలో 50 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని కళాశాల అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉన్నత విద్య పూర్తయిన విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాలను పెంచుకుని ఉద్యోగాలు సాధించాలని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ మణిగణేశ్, ఏఓ సురేశ్, టాస్క్ రీజినల్ కో–ఆర్డినేటర్ గంగప్రసాద్, కంపెనీ ప్రతినిధులు మౌర్య, హెచ్‌ఓడీలు ఆరీఫ్, నటరాజన్, కౌసల్య, స్వాతి, ప్రభాకర్, రాజిరెడ్డి తదితరులున్నారు.

బీసీలందరికీ రుణాలు అందించండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎలిగేడు: బీసీల్లోని అన్ని కులాల వారికీ ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వాల్మీకి బోయ సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుడుగుల మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం వినతిపత్రం అందించారు. వాల్మీకిబోయలను బీసీ రుణాలకు అర్హులుగా చేర్చాలని కోరారు. మీసేవా కేంద్రాల్లో సిగ్నల్ లేక చాలామంది ఇబ్బంది పడుతున్నారని, ఈ క్రమంలో దరఖాస్తుల గడవు పొడిగించాలని విన్నవించారు. బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు కప్పల ప్రవీణ్, సీనియర్ నాయకులు ఇరుగురాల రవి ఉన్నారు.

ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత

సుల్తానాబాద్: ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కోరారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో విద్యా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం శారద, రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.లక్ష విలువ చేసే పుస్తకాలు అందించగా.. చైర్‌పర్సన్ విద్యార్థులకు పంపిణీ చేశారు. పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ సరోజినీదేవి విద్యార్థులకు నగదు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు చేపడుతోందని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాపూరావు, అరుణ, గుణపతి, జ్ఞానేశ్వరి తదితరులు ఉన్నారు.

బీజేపీలో అందరూ సమానమే



టిఫిన్ బైఠక్‌లో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

సుల్తానాబాద్‌రూరల్: బీజేపీలో చిన్నాపెద్ద తేడా ఉండదని, పార్టీ దృష్టిలో అందరూ సమానమేనని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నీరుకుల్లలో ఎల్లమ్మ ఆలయం వద్ద టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ కేంద్రంలో అధికారంలోకొచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, పట్టణ, మండల అధ్యక్షులు కూకట్ల నాగరాజు, వేల్పుల రాజన్న, వివిధ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్, రాజం, వెంకటరమణారావు, సంపత్, తదితరులున్నారు.

చల్లగా తాగేశారు..!

- ఐదు నెలల్లోనే రూ.275.38 కోట్ల విక్రయాలు

ఎండ తాపానికి జోరుగా బీర్ల అమ్మకాలు



సాక్షి, పెద్దపల్లి: సుర్రుమనిపిస్తున్న ఎండల్లో చిల్డ్ బీరును ఎంజాయ్ చేస్తున్నారు మద్యం ప్రియులు. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో మద్యం బాటిళ్లను పక్కనపెట్టి బీరు సీసాలు ఎత్తుతున్నారు. భగభగ మండుతున్న సూర్య ప్రతాపమో..? లేక అలవాటుపడిన ప్రాణమో..? తెలియదుగానీ చల్లచల్లగా అనుకుంటూ మందుబాబులు ఈ వేసవిలో ఒక్క మే నెలలోనే రూ.61.73 కోట్ల బీర్లు తాగేశారు. జేబుకు చిల్లు పడినా.. ఆరోగ్యం పాడవుతున్నా.. పట్టించుకోకుండా లీటర్ల కొద్ది బీరు మింగేస్తున్నారు. కేవలం ఐదు నెలల్లో జిల్లావ్యాప్తంగా ఏకంగా రూ.680.61 కోట్లు చల్లగా సేవించారు.

ఎండలు.. శుభకార్యాలు

జిల్లాలో 74 వైన్ షాపులు, 14 బార్లు ఉన్నాయి. వాటికి ఐఎంఎల్ డిపో నుంచి విస్కీ, బీర్లు సరఫరా అవుతున్నాయి. ఏప్రిల్, మే నెలలో ఎండలు తారస్థాయికి చేరుకోగా.. జిల్లాల్లో మద్యం అమ్మకాలు కూడా అదేస్థాయిలో పుంజుకున్నాయి. మే చివరి నాటికి బీర్ల విక్రయాలు మరింత పెరిగాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పగటిపూట 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. మార్చిలో మాత్రం దంచికొట్టింది. ఏప్రిల్ మొదటి వారం నుంచి జూన్ నెలాఖరు వస్తున్నా.. ఎండల ప్రభావం మాత్రం తగ్గడం లేదు. ఇంకా ఉక్కపోత కొనసాగుతునే ఉంది. ప్రస్తుతం జిల్లాలో 42 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జనాలు ఎండవేడిమితో అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో వేసవి ఎండల బాధ నుంచి తట్టుకోవడానికి మందుబాబులు చల్లని బీరు తాగడానికే ఇష్టపడుతున్నారు. దీనికితోడు వివాహాలు, శుభకార్యాలు కూడా వేసవిలోనే అధికంగా ఉండటంతో విందులు, వినోదాల పేరుతో మద్యం విక్రయాలు పెరిగాయి. సాయంత్రం అయ్యిందంటే చాలు మంచి వాతావరణం చూసుకుని చల్లని కిక్కు కోసం మందుబాబులు బీర్ల కోసం పరుగులు తీస్తున్నారు. ఈ లెక్కన ఒక్క మే నెలలోనే 1,40,306 బీర్ కేసులు అమ్ముడుపోయాయి.

మద్యం అమ్మకాలు ఇలా..

నెల	ఐఎంఎల్	బీర్లు	ఆదాయం (రూ.కోట్లలో)
జనవరి	56,559	73,166	55.33
ఫిబ్రవరి	49,734	77,273	51.92
మార్చి	51,731	1,04,933	57.70
ఏప్రిల్	44,064	87,127	48.70
మే	54,675	1,40,306	61.73
మొత్తం	2,56,763	4,82,805	275.38

మందుబాబులకు కిక్కు.. సర్కారు లక్కు

కిక్కుతోపాటు చల్లగా ఉంటుందని మందు ప్రియులు ఎక్కువగా బీరు తాగుతుండటం సర్కారుకు బాగా కలిసొచ్చింది. ఎక్సైజ్ అధికారుల అంచనా ప్రకారం బీరు అమ్మకాలపై ప్రభుత్వానికి 30శాతం లాభం ఉంటుంది. ఈ ఐదు నెలల్లో బీర్లు భారీగా అమ్ముడుపోవడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా ఎక్కువగానే సమకూరింది. ఎక్సైజ్ అధికారులు తమ లక్ష్యం కోసం బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తూ మద్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. సాధారణ రోజుల్లోని అమ్మకాలతో పోలిస్తే వేసవి కాలం సీజన్‌లో బీర్లు అమ్మకాలు రెట్టింపు దశల్లో అమ్ముడుపోయాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో, జూన్ మొదటివారంలో విపరీతమైన ఎండ ఉండడంతో బీర్లు రికార్డు స్థాయిలో కొనుగోలు చేశారని అధికారులు చెబుతున్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల

విద్యారంగంలో సమున్నత మార్పులు

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- విద్యా దినోత్సవంలో మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన
- కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ధర్మారం: విద్యారంగంలో సమున్నతమైన మార్పులు తీసుకొచ్చి పాఠశాలల్లో వసతులతోపాటు విద్యా వ్యవస్థను మెరుగుపర్చామని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కటికెనపల్లి, ధర్మారం పాఠశాలల్లో విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. మన ఊరు మనబడి పథకం కింద పనులు పూర్తి చేసిన భవనాలను ప్రారంభించారు. కార్పొరేట్‌కు దీటుగా పాఠశాల్లో వసతులు కల్పిస్తున్నామని, ఫలితంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. తక్కువ సమయంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. సర్పంచులు పుస్కూరి జితేందర్‌రావు, కారుపాకల రాజయ్య, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, బలరాంరెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, నోముల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో పాఠశాలల ప్రారంభం

పెద్దపల్లిరూరల్: మన ఊరు మనబడి కార్యక్రమం కింద హైస్కూల్ విద్యార్థులకు డిజిటల్ బోధన, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పిస్తున్నామని కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో పూర్తి చేసిన గదులను ప్రారంభించారు. గదుల్లో ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, వంటగది, డైనింగ్‌హాల్, నీటివసతి, టాయిలెట్లు కల్పించామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. డీఈఓ మాధవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీటీసీ రామ్మూర్తి, ఎంపీపీ స్రవంతి, సర్పంచ్ గాండ్ల మల్లేశం, ఎంపీడీఓ రాజు, ఎంపీఓ సుదర్శన్, ఎంఈఓ సురేందర్, డీఈ శంకరయ్య, ఏఈ మదన్ మోహన్ తదితరులున్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు

జూలపల్లి: సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. కాచాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను సర్పంచ్ బంటు ఎల్లయ్య, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఎంపీటీసీ శ్రీలతతో కలిసి ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి రంగారెడ్డి, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంఈవో కవిత ఉన్నారు. వడ్కాపూర్, జూలపల్లి, పెద్దాపూర్‌లో ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన శాలినీ, బి.శ్రీవైష్ణవిరెడ్డిని సన్మానించారు.

అద్భుతం.. ఆకర్షణీయం

- ముస్తాబైన కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి
- నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- అంతర్జాతీయ ప్రమాణాలతో పనులు పూర్తి
- వెలుగులు విరజిమ్మనున్న డైనమిక్ లైటింగ్
- ప్రతి ఆదివారం వాహనాలకు నోఎంట్రీ
- నగరవాసుల ఉల్లాసం కోసమే: మంత్రి గంగుల
- రేపటి నుంచి నిర్వహణ అంతా కార్పొరేషన్‌దే..



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న కరీంనగర్‌లోని తీగల వంతెన

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎప్పుడెపుడా అంటూ ఎదురుచూస్తున్న తీగల వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న కేబుల్ బ్రిడ్జిని బుధవారం మున్సిపల్ మంత్రి కె.తారకరామారావు ప్రారంభించనున్నారు. సాయంత్రం నుంచి ఈ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించనున్నారు. వాస్తవానికి గత ఏప్రిల్ 14న వంతెన ప్రారంభించాలి. కానీ.. పనులు పూర్తికాకపోవడం.. ఓ సభలో మంత్రి కాలికి గాయంకావడం తదితర కారణాలతో ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వచ్చింది. తెలంగాణ దశాబ్ది వేడుకల వేళ.. పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రెండురోజుల పాటు ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించాలని మంత్రి గంగుల కమలాకర్ నిర్ణయించారు.

నగరవాసుల కోసం..

జిల్లా పర్యాటకంలో కలికితురాయిగా నిలిచే కేబుల్ బ్రిడ్జిని తొలుత నగరవాసులకు పరిచయం చేయాలని మంత్రి గంగుల కమలాకర్, జిల్లా అధికారులు నిర్ణయించారు. స్థానికులు వంతెనపై అటూఇటూ సంచరించేందుకు వీలుగా ప్రతీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వాహనాలకు అనుమతి నిలిపివేశారు. పర్యాటకులను రంజింపజేసేలా మ్యాజిక్ షో, మ్యూజిక్ షో, కళకారుల ఆటాపాటలు తదితర వినోద కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధంచేశారు. రకరకాల ఫుడ్‌కోర్టులు ఏర్పాటుచేయనున్నారు. దాదాపు దసరా పండుగ వరకు కుటుంబాలతో వచ్చి సరదాగా గడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. వంతెన వద్ద కొరియా సాంకేతికతతో రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న డైనమిక్ లైటింగ్ సిస్టమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

నేపథ్యమిదీ..

వరంగల్ – కరీంనగర్ నగరాల మధ్య దాదాపు 7.కి.మీల దూరం తగ్గించడం, హైదరాబాద్–కరీంనగర్ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రభుత్వం కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి పూనుకుంది. 2018లో రూ.180 కోట్ల అంచనా బడ్జెట్‌తో పనులు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని దుర్గంచెరువు తీగల వంతెన తర్వాత తెలంగాణలో రెండో బ్రిడ్జి కరీంనగర్‌దే కావడం విశేషం. పూర్తిగా విదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన వంతెన నాణ్యతను ఆర్ అండ్ బీ అధికారులు పలుమార్లు పరీక్షించారు.

రేపటి నుంచి కార్పొరేషన్ నిర్వహణ..

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న తీగల వంతెన నిర్వహణ బాధ్యతలు గురువారం నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ కరీంనగర్(ఎంసీకే) చేతుల్లోకి వెళ్లనుంది. వంతెనపై లైటింగ్, పారిశుద్ధ్యం నిర్వహణ, విద్యుత్ తదితరాలు ఇకపై బల్దియా చూసుకుంటుంది. రెండేళ్లపాటు వంతెనకు సంబంధించిన సాంకేతికపరమైన నిర్వహణను మాత్రం ఆర్ అండ్ బీ అధికారులు చూస్తారు. అంతేకాకుండా వంతెనపై రెండు భారీ పిల్లర్ల అంచున నాలుగు ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేయనున్నారు. వీటిపై ప్రభుత్వ, ప్రైవేటు ప్రకటనలు ప్రదర్శించనున్నారు.

కేటీఆర్ పర్యటన సాగనుందిలా..

కేబుల్ బ్రిడ్జితోపాటు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న మున్సిపల్, ఐటీ మినిస్టర్ కె.తారకరామారావు బుధవారం సాయంత్రం 5 గంటలకు రూ.10 కోట్లతో కశ్మీర్ గడ్డలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 5.05 గంటలకు రూ.7 కోట్లు వెచ్చించి నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.2 కోట్ల వ్యయంతో సిటిజన్ సర్వీస్ సెంటర్ ప్రారంభించనున్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఐసీసీ వీడియో వాల్ కంట్రోల్ రూం, 14 జంక్షన్ల ఆటోమేటెడ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం (ఏటీసీఎస్), 18 చోట్ల ఏర్పాటు చేసిన పబ్లిక్ అండ్రసింగ్ సిస్టం(పీఏఎస్), 8 చోట్ల వేరియబుల్ మెసేజింగ్ సిస్టం, ఐదుచోట్ల వాతావరణ సూచికలు, 18 ప్రాంతాల్లో వైఫై హాట్‌స్పాట్లు, ఘన వ్యర్థాల నిర్వహణను మంత్రి ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటలకు కమాన్‌మీదుగా ఓపెన్‌టాప్ జీపులో ర్యాలీగా వెళ్లి కేబుల్ బ్రిడ్జి ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన డైనమిక్ లైటింగ్ సిస్టమ్‌కు స్విచ్చాన్ చేయనున్నారు.

పర్యాటక కేంద్రంగా..



కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని టూరిజం స్పాట్‌గా నిలపాలన్న సీఎం కేసీఆర్ ఆలోచనల్లో భాగంగానే తీగల వంతెన ఏర్పాటైంది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఆయనకు కరీంనగర్ మీద ఉన్న మమకారం అలాంటిది. రూ.180 కోట్ల వ్యయంతో కేబుల్ బ్రిడ్జి, రూ.410 కోట్లు వెచ్చించి మానేరు పరీవాహక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మానేరు రివర్ ఫ్రంట్ (ఎంఆర్‌ఎఫ్) ప్రాజెక్టును మంజూరుచేశారు.

– మంత్రి గంగుల కమలాకర్

కేబుల్ బ్రిడ్జి విశేషాలు..

- 500 మీటర్ల పొడవైన రోడ్డు, ఫోర్‌లేన్
- ఇటలీ నుంచి తెప్పించిన 26 పొడవైన స్టీల్ కేబుల్స్
- వంతెనకు రెండు పైలాన్లు.. వీటి మధ్యదూరం 220 మీటర్లు
- పైలాన్ నుంచి ఇంటర్ మీడియన్‌కు దూరం 110 మీటర్లు
- రూ.180 కోట్ల బడ్జెట్.. పూర్తిగా అధునాతన ఇంజినీరింగ్
- రూ.8 కోట్లతో కొరియా డైనమిక్ లైటింగ్ సిస్టమ్
- వెడల్పు 21.5 మీటర్లు, ఒక్కోటి 7 మీటర్ల వెడల్పుతో రెండు దారులు
- రోడ్డుకు ఇరువైపులా 2.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు
- టాటా కంపెనీ సారథ్యంలో నిర్మాణం
- 2017 డిసెంబర్‌లో నిర్మాణానికి శంకుస్థాపన
- 2018 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం
- 2023 జనవరి 26న వంతెనపై పనుల కోసం వాహనాలకు అనుమతి
- 2023 జూన్ 21న వంతెన ప్రారంభం

సింగరేణీయుల్లో వెలుగులు నింపిన కేసీఆర్

గోదావరిఖని/రామగుండం/గోదావరిఖనిటౌన్/ఫెర్టిలైజర్‌సిటీ: కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలు, ప్రగతిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆర్జీ–1 ఏరియాలో గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సొంతింటి కోసం రూ.10 లక్షల వడ్డీలేని రుణం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం అమలు చేసింది బీఆర్‌ఎస్ పార్టీ అన్నారు. పలువురు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు గంగ్ర దామోదర్‌రావు, మల్లేశ్, దాతు శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, జాహిద్‌పాషా, తోట చంద్రయ్య, వెంకటేశ్, పుట్ట రమేశ్ పాల్గొన్నారు. విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఒలంపిక్ రన్‌డేను ప్రారంభించారు. ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్, సీఐలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యా విధానంలో తెలంగాణ ఆదర్శం

విద్యా విధానంలో రాష్ట్రం ఆదర్శంగా ఉందని చందర్ అన్నారు. రామగుండంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన గదులను ప్రారంభించారు. స్థానిక శారదనగర్‌లోని బాలికల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విద్యదినోత్సవంలో మాట్లాడారు. కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్‌లో మైనార్టీ గురుకులం భవనాన్ని ప్రారంభించారు. మైనార్టీ గురుకులాల్లో ఉచిత విద్య, భోజనం అందిస్తున్నామన్నారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.



క్రీడాజ్యోతిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్, జీఎం శ్రీనివాస్

నేడు ఆధ్యాత్మిక దినోత్సవం

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. జిల్లాలోని ఎనిమిది ప్రధాన ఆలయాలు, అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ఓదెలలోని మల్లన్న ఆలయం, రామగుండంలోని కోదండరామాలయం, కమాన్‌పూర్‌లోని ఆదివరాహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 104 ఆలయాలు దూప, దీప నైవేద్య పథకం కింద కొనసాగుతున్నాయని, తాజాగా మరో 42 ఎంపికయ్యాయని వివరించారు. 24 మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు, 31 చర్చిల్లో రాత్రి 7నుంచి 9గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గీత కార్మికులకు రూ.లక్ష ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రదీప్‌కుమార్ గౌడ్, గీత కార్మికులు

జూలపల్లి(పెద్దపల్లి): ప్రభుత్వం వెనకబడిన తరగతుల వారికి ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని గీత కార్మికులకు కూడా ఇవ్వాలని యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు అమరగాని ప్రదీప్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. జూలపల్లి మండలంలోని గీత కార్మికులతో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ అబుబాకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని, ప్రమాదకర వృత్తిలో ఉన్న వీరిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ వస్తే గీత కార్మికుల బతుకులు మారుతాయని ఆశపడ్డామని తెలిపారు. కానీ వారు నిరాదరణకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గీత కార్మికులను రూ.లక్ష ఆర్థిక సాయం పథకంలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో తీగెల అశోక్‌గౌడ్, గుండు నరేశ్, గడ్డమీది మహేశ్, సాగర్, పురుషోత్తం, కొమురయ్య, లచ్చయ్య, పర్షయ్య, చందు, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

కల్లు దుకాణంపై దాడి



పగిలిన కల్లు సీసాలు

జ్యోతినగర్(రామగుండం): కల్లు దుకాణంపై కొంతమంది యువకులు దాడికి పాల్పడిన ఘటన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్రాశాలపల్లెలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో పొన్నం గౌరయ్య గౌడ్ కల్లు దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం కల్లు విక్రయిస్తుండగా కొంతమంది యువకులు వచ్చి, సీసాల్లో ఉన్న కల్లు పారబోశారు. వాటిని పగులగొట్టి, దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గౌరయ్య గౌడ్ గీత వృత్తి చేసుకుంటూ ఇంటి వద్ద కల్లు అమ్ముతుంటాడని స్థానికులు తెలిపారు. కల్లు కోసం వచ్చి గొడవ చేయడం, దాడికి పాల్పడటాన్ని తెలంగాణ గౌడ సంఘం జిల్లా కమిటీ, రామగుండం కార్పొరేషన్ కమిటీ నాయకులు ఖండించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

లారీని ఢీకొన్న బైక్

- యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని నల్ల పోచమ్మ వాడకు చెందిన ఎండీ.వాహబ్ మంగళవారం బైక్‌పై వెళ్తూ రంగంపల్లి వద్ద ఓ లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం వాహబ్‌ను కరీంనగర్ తరలించారు.

భూసార పరీక్ష.. పంటకు రక్ష

- అధిక దిగుబడులు సాధించవచ్చు
- రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కమాన్‌పూర్(మంథని): వానాకాలం సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. పంటలు వేసే ముందు భూసార పరీక్షలు చేయించుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అంటున్నారు. భూమి స్వభావం, మృత్తిక ఏ రకానికి చెందినదో, పోషక పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుందని పేర్కొంటున్నారు. పంటల సాగులో వృథా ఖర్చుల నుంచి రైతులు విముక్తి పొందవచ్చని చెబుతున్నారు. భూసార పరీక్షతో ఏది తేలిక నేల, బరువు నేల తదితర విషయాలు తెలుస్తాయని, పంటకు కావాల్సిన పోషకాలు ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవచ్చని అంటున్నారు.

భూసారం తెలుసుకోవడం అవసరం

నేలలో సహజంగా ఉన్న పోషక పదార్థాలతోపాటు అదనంగా వేసిన సేంద్రియ, రసాయన ఎరువుల్లోని పోషకాలు పంట దిగుబడికి దోహదపడతాయి. నేలలో ఉన్న భూసారాన్ని తెలుసుకోవడం ఎంతో అవసరం. రైతులు పొలం, చేనులో రెండేళ్లకోసారి భూసార పరీక్ష చేయించుకుంటే పోషక విలువలతోపాటు భూమిలో ఉండే చౌడు గుణాలను, సున్నం శాతాన్ని, నేల కాలుష్యాన్ని తెలుసుకోవచ్చు.

మట్టి నమూనా సేకరణ విధానం

రైతులు పొలంలో వి ఆకారంలో 15 సెంటీమీటర్ల వరకు పారతో గుంత తీసి, అందులో పై పార నుంచి కింది వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి. ఎకరం విస్తీర్ణంలో 8 నుంచి 10 చోట్ల తీసిన మట్టిని ఒక దగ్గర పోసి, బాగా కలిపి, నాలుగు భాగాలుగా చేసి, మిగతాది తీసివేయాలి. మట్టి కిలోన్నర వచ్చే వరకు చేయాలి. సేకరించిన మట్టిలో రాళ్లు, పంట వ్యర్థాలు లేకుండా చేసి, ఆరబెట్టాలి. ఇందుకోసం రసాయన, సేంద్రియ ఎరువుల సంచులు వాడొద్దు. పంట కాలువల్లోని చెట్ల కింద, నీటి నిల్వ ఉన్నచోట మట్టిని సేకరించవద్దు. చౌడు ఉన్నట్లు అనుమానం వస్తే అక్కడి మట్టిని తీసి, ప్రత్యేక కవరులో తీసుకోవాలి.

పండ్ల తోటల పెంపకం కోసం..

పండ్ల తోటలకు అనువైన నేలలను గుర్తించడానికి పంటను బట్టి మూడు నుంచి ఆరు అడుగుల లోతు గుంత తవ్వి, ప్రతీ అడుగుకు కొంత మట్టిని సేకరించి భూసార పరీక్షకు పంపించాలి. తీసిన మట్టి నమూనాలను నీడలో పెట్టి, గాలి ఆరిన తర్వాత ప్లాస్టిక్ బ్యాగులో లేదా గుడ్డలో నింపుకొని, కృషి విజ్ఞాన కేంద్రంలోని భూసార పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి.

నమూనాలతో పంపాల్సిన వివరాలు..

మట్టి నమూనాలతోపాటు రైతు పేరు, సర్వే నంబర్, గ్రామం, మండలం పేరు, భూసార పరీక్షకు మట్టి తీసిన పొలం లేదా చేనులో సాగు చేసిన పంట, సాగు చేయబోయే పంట వివరాలను పంపాల్సి ఉంటుంది.

పరీక్ష చేయించాలి



రైతులు పంటలు సాగు చేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్ష చేయించాలి. వచ్చే ఫలితాన్ని బట్టి భూమిలో ఏ పంట సాగు చేయాలో శాస్త్రవేత్తలు చెబుతారు. వారి సలహాలు, సూచనలు పాటించి పంటలు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– కిరణ్ పిల్లి, రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం మృత్తిక శాస్త్రవేత్త

రాష్ట్రంలో ఎగిరేది కాంగ్రెస్ జెండాయే

- ఎమ్మెల్యే అసమర్థత వల్లే గోదావరి కరకట్ట నిర్మించడం లేదు
- డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్



జోడో యాత్రలో మక్కాన్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్రంలో ఎగిరేది కాంగ్రెస్ జెండాయేనని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం రాత్రి రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్‌లో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కంక రాజు, ఈదునూరి మల్లేశ్‌ల ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర నిర్వహించారు. జంగాలపల్లి, న్యూపోరట్‌పల్లిల్లో మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే అసమర్థత వల్లే గోదావరి కరకట్ట నిర్మించడం లేదని ఆరోపించారు. గోదావరి బ్యాక్ వాటర్ వల్ల డివిజన్ పూర్తిగా మునిగిపోయి, ఎంతో ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వరంగల్ రైతు, యూత్ డిక్లరేషన్‌లతోపాటు రూ.500కే గ్యాస్ సిలిండర్, సొంత స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, కుటుంబంలో ఇద్దరు వృద్ధులు ఉంటే రూ.5 వేల పెన్షన్, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం, రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ.ముస్తఫా, గాదం విజయ, ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, మాజీ కార్పొరేటర్ నస్రీన్ బేగం, కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు రషీద్, నాయకులు, కార్యకర్తలున్నారు.

కార్పొరేషన్‌లో రోడ్ల పనులు అస్తవ్యస్తం

గోదావరిఖని(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్ల నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయని, ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ విమర్శించారు. మంగళవారం మేదరిబస్తీలో పర్యటించారు. పనుల కారణంగా పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని డిమాండ్ చేశారు. పనులు అస్తవ్యస్తంగా చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్లపై కంకర, చూర, ఇసుక కుప్పలు ఉన్నాయని, వెంటనే పనులను పూర్తి చేయాలన్నారు. నాయకులు ముస్తఫా, విజయానంద్, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

పని చేసి పైసలడిగినందుకు దాడి

- తారుపల్లి పంచాయతీ కార్యదర్శి నిర్వాకం
- వైండింగ్ షాపు నిర్వాహకుడికి మద్దతుగా గ్రామస్తుల నిరసన
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న తారుపల్లి గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తాగునీటి సరఫరా కరెంటు మోటార్ల మరమ్మతు బిల్లులు ఇవ్వాలని అడిగినందుకు ఓ వైండింగ్ షాపు నిర్వాహకుడిపై పంచాయతీ కార్యదర్శి దాడికి పాల్పడిన ఘటన కాల్వశ్రీరాంపూర్ మండలంలోని తారుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తారుపల్లికి చెందిన దుంద్ర రాజయ్య ఇదే గ్రామ పంచాయతీకి సంబంధించిన తాగునీటి సరఫరా కరెంట్ మోటార్లకు మరమ్మతు చేశాడు. మంగళవారం జీపీ కార్యాలయానికి వెళ్లి, తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి నయీంను కోరాడు. దీంతో ఆయన తనపై దాడి చేశాడని బాధితుడు వాపోయాడు. ఈ ఘటనను నిరసిస్తూ గ్రామస్తులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి, బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎంపీడీవో రామ్మోహనాచారిని వివరణ కోరగా వైండింగ్ షాపు నిర్వాహకుడు రాజయ్య, గ్రామస్తుల ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు కాల్వశ్రీరాంపూర్ పోలీసులు తెలిపారు.

23న అనాథల అరిగోస దీక్షలు



మాట్లాడుతున్న సామ్యెల్

మంథని: అనాథ పిల్లల సంక్షేమం కోసం ఈ నెల 23న అన్ని జిల్లా కేంద్రాల్లో అనాథల అరిగోస దీక్షలు చేపట్టనున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి మంథని సామ్యెల్ తెలిపారు. మంగళవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అనాథ హక్కుల వేదిక, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్షలకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, అనాథ ఆశ్రమాల నిర్వాహకులు అండగా నిలవాలని కోరారు. సామాజిక ఉద్యమాల ద్వారా ఎందరివో కన్నీళ్లు తుడిచామని, అనాథ పిల్లల కన్నీళ్లు తుడవడానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలను అందించడం కోసమే ఈ కార్యక్రమన్నారు. సీఎం కేసీఆర్ సర్కారు అనాథలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయిని అనిల్, మండల కన్వీనర్ మంథని ప్రమోద్, నాయకులు చందు, లింగయ్య, సుధాకర్, అశోక్, రాజయ్య తదితరులున్నారు.

'ప్రవక్త ఇబ్రహీం త్యాగశీలి'

పెద్దపల్లిరూరల్: ప్రవక్త ఇబ్రహీం త్యాగశీలి అని, ఆయన త్యాగాలను సమాజానికి వివరించేందుకు జమాతే ఇస్లామీ హింద్ సభలు నిర్వహిస్తోందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇసాక్ అలీ అన్నారు. పెద్దపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొప్ప ప్రవక్తల్లో ఒకరిగా ఇబ్రహీం గౌరవం పొందారని తెలిపారు. నాయకులు జావీద్, హాదీ తదితరులున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలంలోని రాజాపూర్‌కు చెందిన ఎర్ల బాపు(44) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంటికి వచ్చి, పక్కనే ఉన్న ఎడ్ల కొట్టంలోకి వెళ్లి, ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు అంజిత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి ప్రసాద్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



భార్య, కుమారులతో శంకర్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చందర్

- సిమెంట్ పిల్లర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఘటన
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు
- వివరాలు తెలుసుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్(రామగుండం): 'ఓ దేవుడా.. ఎంత పని చేశావయ్యా.. నీకు మేము ఏం అన్యాయం చేశాం.. మా ఇంటి దిక్కును మాకు శాశ్వతంగా దూరం చేశావా.. ఇక మాకు దిక్కెవరు తండ్రీ..' అంటూ ఆ కుటుంబసభ్యులు రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి మల్యాలపల్లె సమీపంలోని రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రామగుండం శివాజీనగర్‌కు చెందిన గుంజపడుగ శంకర్ (33) రైల్వేస్టేషన్ ప్రాంతంలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం సెలవు దినం కావడంతో పనిమీద బైక్‌పై గోదావరిఖని వెళ్లాడు. తిరిగి వస్తూ కుందనపల్లి పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించేందుకు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న సిమెంట్ పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. అదే దారిలో వస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తన వాహనాన్ని ఆపి, మృతుడి వివరాలు ఆరా తీశారు. అనంతరం ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్‌కు సమాచారం అందించారు. మృతుడికి భార్య అనూష, ఇద్దరు కుమారులు ఉన్నారు. శంకర్ మృతి వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనాస్థలికి చేరుకొని, కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అందరితో కలిసిమెలిసి ఉండే శంకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రైల్వేస్టేషన్ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సెలవు రోజున శాశ్వతంగా వెళ్లి పోయావా శంకరన్నా అని చాలా మంది కంటతడి పెట్టారు.

అధికారులపై చార్జిషీట్లు రద్దు చేయండి



మాట్లాడుతున్న సీఎంవోఏఐ సంఘం నాయకులు, పక్కన జీఎంలు

- సింగరేణి అధికారుల సంఘం డిమాండ్

గోదావరిఖని(రామగుండం): ఎస్ఆర్‌పీ ఓసీపీ ఘటనకు సంబంధించి 32 మందికి అధికారులకు ఇచ్చిన చార్జిషీట్లను వెంటనే రద్దు చేయాలని సింగరేణి అధికారుల సంఘం(సీఎంవోఏఐ) డిమాండ్ చేసింది. మంగళవారం గోదావరిఖనిలోని ఇల్లెందు క్లబ్‌లో బెల్లంపల్లి, రామగుండం రీజియన్ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అధికారుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఎస్ఆర్‌పీ ఓసీపీ ఘటనకు సంబంధం అధికారులకు చార్జిషీట్లు ఇచ్చారని, పత్రికల్లో వచ్చిన కథనాలు, బయటి నుంచి వచ్చిన ఒత్తిళ్లతో సేఫ్టీని సాకుగా చూపే ఇలా చేశారని ఆరోపించారు. నాలుగేళ్లుగా విచారణ పేరుతో ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నార అన్నారు. దీనివల్ల ప్రమోషన్లు లేక, బెనిఫిట్స్ కోల్పోయి, విచారణ కారణంగా అధికారులు, వారి కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ఫ్లూయిడ్ పంపుల వినియోగం నిలిపివేస్తాం

చార్జిషీట్లు రద్దు చేయకుంటే ఫ్లూయిడ్ పంపుల వినియోగాన్ని వచ్చే వారం నుంచి సింగరేణి వ్యాప్తంగా పూర్తిగా నిలిపివేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ఐఐటీ, ఐఐఎం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్‌ను అధికారులకు అమలు చేయలేదని తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరం పేమెంట్ రిలేటెడ్ పర్ఫార్మెన్స్, 2007-14కి సంబంధించిన పీఆర్‌పీ చెల్లించాలన్నారు. సింగరేణి అధికారులకు నాలుగేళ్లకోసారి ల్యాప్‌టాప్‌లు అందించాల్సి ఉండగా ఏడేళ్లయినా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రామగుండం మెడికల్ కాలేజీలో కనీసం 30 శాతం సీట్లు సింగరేణి ఉద్యోగులు, అధికారుల పిల్లలకు కేటాయించాలని కోరారు. మూడో పీఆర్సీ తర్వాత అధికారుల జీతాల్లో తలెత్తిన పే అనామలీ ఇతర సమస్యలను యాజమాన్యం ద్వారా మినిస్ట్రీ ఆఫ్ కోల్ దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలన్నారు. సీఎంవోఏఐ శ్రీరాంపూర్ బ్రాంచి అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ-2 జీఎం మనోహర్‌రావు, నాయకులు ఏవీ రెడ్డి, చిలక శ్రీనివాస్, దీటి చంద్రమౌళి, డాక్టర్ రమేశ్‌బాబు, రెండు రీజియన్ల అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు రక్షణతో సాధించాలి

- ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్‌రావు



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ-3 పరిధిలో ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలని జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన అధికారులతో రక్షణ, ఉత్పత్తి, ఉత్పాదకత తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఆర్జీ-3 ఏరియాలో యంత్రాల పనితీరు మెరుగుపరుకుంటూ పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ఉత్పత్తి సాధించాలని సూచించారు. రక్షణ విషయంలో అశ్రద్ధ వహించొద్దని, ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని చెప్పారు. సమావేశంలో అధికారులు ఎలీషా, రఘుపతి, శ్రీనివాసులు, రాధాకృష్ణ, నరేందర్, వెంకటరమణ, జైనులాబద్దీన్, శ్రీనివాస్, నాగరాజు, కాశీ విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్, కర్ణ, పద్మరాజు, సత్యనారాయణ, ఐలయ్య, లక్ష్మీనారాయణ, ఉదయ్ హరిజన్, రామారావు, రవీందర్‌రెడ్డి, సర్వే, సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త తొలగిస్తున్న అధికారి సత్యనారాయణ

కమాన్‌పూర్(మంథని): సింగరేణి, కార్మికులు, అధికారులు, సింగరేణి పరిసర ప్రాంతాల ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్జీ-3, ఏపీఏ పర్యావరణ(ఇన్‌చార్జి) అధికారి బీవీ.సత్యనారాయణ పిలుపునిచ్చారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పన్నూర్ సెంటర్‌లో ఆయన రోడ్డుపై, బస్టాండ్‌లో చెత్త తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, జనప నార, గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో డీవైపీఎంలు ఎం.రవీందర్‌రెడ్డి, కె.మారుతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, సివిల్ సూపర్‌వైజర్ యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

- బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జీడీకే-11 గనిపై గేట్ మీటింగ్, స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తమ యూనియన్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు 2017లో నిర్వహించగా 2019 నాటికే కాలపరిమితి ముగిసిందన్నారు. రెండేళ్ల తర్వాత నిర్వహించాల్సిన ఎన్నికలు నాలుగేళ్లు పూర్తయినా జరపడం లేదని మండిపడ్డారు. కేంద్ర కార్మిక శాఖ నుంచి క్లియరెన్స్ వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో అనేక ఆంక్షలు విధిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. 11వ వేతన ఒప్పందం సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తేందుకు కృషి చేశామన్నారు. గతంలో కన్నా తక్కువ వ్యవధిలో మంచి ఒప్పందం జరిగిందని తెలిపారు. జూన్ నెల కొత్త వేతనాలు జూలైలో కార్మికులకు అందుతాయని పేర్కొన్నారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, నాయకులు పవన్‌కుమార్, మండ రమాకాంత్, పులి రాజారెడ్డి, వేణుగోపాల్‌రావు సారంగపాణి, ఆకుల హరిణ్, సతీశ్, రవీందర్, స్వామి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు నెరవేర్చండి

- నేటి నుంచి పది రోజులపాటు నిరసన కార్యక్రమాలు
- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద చేపట్టిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జరిగే పోరాటాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలవెన్సుల పెంపుపై 25 సార్లు చర్చలు జరిపినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. బుధవారం నుంచి పది రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. మహా నిరసన, లేబర్ గేట్ నుంచి ప్లాంట్ పరిపాలనా భవనం వరకు ర్యాలీ, మేడిపల్లి సెంటర్‌లో వంటావార్పు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన, కార్మికులతో లేబర్ గేట్ వద్ద భిక్షాటన, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందించడం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీరోజు కార్మికులు గేట్ వద్ద ఒక గంటపాటు నిరసన తెలిపి, విధులకు హాజరు కావాలని సూచించారు. నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, లక్ష్మారెడ్డి, సునీల్, లక్ష్మణ్, తోకల రమేశ్, ఇజ్జగిరి భూమయ్య, చింతల సత్యం, రాధారపు రాజమల్లయ్య, రాజిరెడ్డి, కంది చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

పెద్దపల్లిరూరల్: యువత సన్మార్గంలో పయనించాలని పెద్దపల్లి సీఐ అనిల్ అన్నారు. పెద్దపల్లి మండలం గుర్రాంపల్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. ఈజీ మనీ కోసం వెంపర్లాడుతూ.. చెడువ్యసనాలకు లోనై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజలు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నంబరు 100కు డయల్ చేసి చెప్పాలన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఆకతాయిలపై ఫిర్యాదు చేస్తే షీటీం బృందం వెంటనే రంగంలోకి దిగి చర్యలు తీసుకుంటుందన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, ఎస్సై మహేందర్ తదితరులున్నారు.